# రేపే కౌంటింగ్

- పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకున్న ఈవీఎంలు
- భారీ భద్రత నడుమ తరలింపు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్లు


పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్ క్రాంతి

గద్వాల, డిసెంబర్ 1 : గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన శాసనసభ ఎన్నికలు గురువారం ముగియడంతో పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను అదేరోజు రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మహిళా డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్ర పర్చారు. ఆదివారం కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో స్ట్రాంగ్ రూంలోని ఈవీఎంలు, వీవీప్యాట్లను శుక్రవారం గద్వాల మండలం గోన్‌పాడ్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భారీ భద్రత మధ్య తరలించారు. ఆదివారం రెండు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ అక్కడే చేయనున్నారు. ఆ ప్రదేశంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 600మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు**

జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గద్వాల మండల పరిధిలో గోన్‌పాడ్ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టనున్నారు. డీసీఎంల ద్వారా తరలించిన ఈవీఎంలను కళాశాలలో ఏ ర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపర్చా రు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరు గదులను నెం బర్ల ప్రకారం విభజించారు. అలంపూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గ్రౌండ్‌ఫ్లోర్ లో, గద్వాల నియోజకవర్గానికి సంబంధించి మొదటి అంతస్తులో ఏర్పాట్లు చేశారు.

**ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్**

ప్రియదర్శిని డిగ్రీకళాశాల నుంచి ఈవీఎంలను పాలిటెక్నిక్ కళాశాలకు తరలించగా ఏర్పాట్లను కలెక్టర్ క్రాంతి పర్యవేక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్ రూంలో భద్రపర్చి సీల్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తదితరులు ఉన్నారు.


పోలీస్ బలగాల పహారాలో డీసీఎంలో ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాసులు, అపూర్వచౌహాన్

## లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్, కలెక్టర్ క్రాంతి

గద్వాల, డిసెంబర్ 1 : సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపును ఆదివారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఈవీఎం స్ట్రాంగ్ రూంలోని ఈవీఎంలను రాజకీయపార్టీల నాయకులతో కలిసి సీల్ వేసి భద్రపర్చారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకులు ఏజెంట్లు ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకొని ఐడీకార్డులు పొందాలన్నారు. ఐడీకార్డులు ఉన్నవారినే ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు ఏజెంట్లు చేరుకోవాలని సూచించారు. వారి వెంట అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ, అదనపు ఎస్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత

- సీనియర్ సివిల్ కోర్టు జడ్జి గంట కవితాదేవి


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కవితాదేవి

గద్వాల టౌన్, డిసెంబర్ 1 : ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యతని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి గంట కవితాదేవి అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాధులపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. హెచ్ఐవీ నిర్మూలనలో యువత పాత్ర కీలకమైందన్నారు. వ్యాధిగ్రస్తులను దూరం ఉంచకుండా వ్యాధిని తరిమేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాధి నిర్మూలనలో భాగస్వాములై తమవంతు పాత్ర పోషించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప, డీఆర్‌డీవో జెడ్పీ సీఈవో కాంతమ్మ, సూపరింటెండెంట్ కిశోర్, ఎంఏఎల్‌డీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కోదండరాముడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## రమణీయం రాములోరి కల్యాణం

ఇటిక్యాల, డిసెంబర్ 1 : పునర్వసు నక్షత్రాన బీచుపల్లి కోదండరామాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు భువనచంద్ర శిష్య బృందం వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేడుకలో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమాలను మేనేజర్ సురేందర్‌రాజు పర్యవేక్షించారు. స్వామివారి భక్తుడు గోపల్‌దిన్నె సత్యం భక్తులకు అన్నదానం చేశారు.

# చకచకా వంతెన పనులు

- రూ. 40లక్షలతో పోలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం
- త్వరలోనే స్లాబ్ పనులు చేపట్టేలా చర్యలు


పిల్లర్ దశకు చేరుకున్న పోలోనివాగుపై బ్రిడ్జి పనులు

అయిజ, డిసెంబర్ 1 : పట్టణ సమీపంలోని చిన్న తాండ్రపాడుకు వెళ్లే రహదారిలోని పోలోనివాగుపై చేపట్టిన వంతెన పనులు జోరుగా సాగుతున్నాయి. వానకాలంలో పోలోనివాగు పొంగి ప్రవహిస్తే అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు, వేణిసోంపురం, కేశవరం, నౌరోజీ క్యాంప్, రాజోళి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్ తదితర గ్రామాలకు రవాణాపరంగా రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో పంచాయతీ రాజ్‌శాఖ రూ.40లక్షల నిధులు విడుదల చేయగా అధికారులు టెండర్ పిలిచి గత అక్టోబర్‌లో పనులు ప్రారంభించారు. పోలోనివాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రాకపోకలు అనువుగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే పిల్లర్ల పనులు పూర్తికాగా స్లాబ్ పనులు త్వరలోనే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

## అలంపూర్‌లో 79.80శాతం పోలింగ్

అలంపూర్, డిసెంబర్ 1 : సాధారణ ఎన్నికల్లో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలో 79.80 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఏడు మండలాల్లో మొత్తం 2,37,938మంది ఓటర్లు ఉండగా 1,96,307 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారిలో 98,786 మంది పురుషులు, 97,519మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఓటు వేశారు. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా 290 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

**ఇటిక్యాలలో 83శాతం పోలింగ్**

ఇటిక్యాల, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 83.04శాతం ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో మొత్తం 49 పోలింగ్ బూత్‌లలో 41,370మంది ఓటర్లు ఉండగా అందులో 20,613మంది పురుషులు, 20,756మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 17,323మంది మహిళలు, 17,029 మంది పురుషులు మొత్తం 34,352మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

## రెండోవారంలో సైన్స్ ఎగ్జిబిషన్

గద్వాల టౌన్, డిసెంబర్ 1 : రెండోవారంలో జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సిరాజుద్దీన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎగ్జిబిషన్‌లో ఆరోగ్యం, లైఫ్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్టు, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి అంశాలు ఉంటాయన్నారు. అలాగే నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన, బీఎడ్, డీఎడ్ ట్రైనీ విద్యార్థులూ ఆవిష్కరణ బోధనలో పాల్గొనవచ్చని తెలిపారు. అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అయిజ రూరల్, డిసెంబర్ 1 : మండలంలోని బింగిదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు ఇంట్లో గురువారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్, ఎల్‌ఈడీ టీవీ, ఇన్వర్టర్, దుస్తులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాముడు శుక్రవారం గ్రామానికి వెళ్లి నర్సింహులు కుటుంబానికి రూ.పదివేలు ఆర్థికసాయం అందజేశారు.


కాలిన వస్తువులను పరిశీలిస్తున్న నాయకులు

## ఆర్డీఎస్‌కు నిలకడగా వరద


ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద

అయిజ, డిసెంబర్ 1 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నిలకడగా కొనసాగుతున్నది. శుక్రవారం ఆనకట్టకు 4,329 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, సుంకేసుల బ్యారేజీకి 3,800 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 529 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిళ్ల పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు..**

తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 790 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 4,502 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 13.659 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. 1,633 అడుగులకు గానూ 1,592.94 అడుగులకు చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## అడ్మిషన్ ఫీజుకు 11 ఆఖరు

గద్వాల టౌన్, డిసెంబర్ 1 : ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో అడ్మిషన్ పొందేందుకు గానూ ఫీజు చెల్లింపునకు ఈనెల 11వరకు అపరాధ రుసుంతో అవకాశం ఉన్నట్లు డీఈవో సిరాజుద్దీన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్ ఆన్‌లైన్, మీ సేవల ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.